

చింతచెట్టుతండాలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులు

## ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- సీఐ రాఘవేందర్ రెడ్డి
- సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు

కొండమల్లేపల్లి, నవంబర్ 5: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ రాఘవేందర్‌రెడ్డి సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం గుమ్మడవెల్లి, గుడితండా, చింతచెట్టుతండా, గాజీనగర్ గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలకు భద్రత కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వీరబాబు, కేంద్ర బలగాలు, పోలీసులు పాల్గొన్నారు.

## బంజారా భవన నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న డాక్టర్ రమావత్ శంకర్‌నాయక్

చందంపేట, నవంబర్ 5: దేవరకొండ పట్టణంలో నిర్మిస్తున్న బంజారా సేవాలాల్ భవన నిర్మాణానికి లక్ష్మీవిజయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ రమావత్ శంకర్‌నాయక్ ఆదివారం రూ.50వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిర్మాణ కమిటీ సభ్యులు శంకర్‌నాయక్‌ను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# పనిచేసే ప్రభుత్వానికి ప్రజల మద్దతు

- దేవరకొండ ఖిల్లాపై గులాబీ జెండా ఎగరడం ఖాయం
- ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్
- వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరికలు



కొండబీమనపల్లి: గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

దేవరకొండ, నవంబర్ 5: పనిచేసే ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ఆదివారం కొండబీమనపల్లి గ్రామానికి చెందిన కృష్ణజాంబవ్‌తో పాటు 200 కుటుంబాలు బీఎస్పీ నుంచి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవీంద్రకుమార్ మాట్లాడుతూ దేవరకొండ ఖిల్లాపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసే ప్రజలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ఆయన చెప్పారు. తెలంగాణలో అమలు అవుతున్న పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. బీఆర్ఎస్ వెంటే సబ్బండ వర్గాలు ఉంటాయని తెలిపారు. ఎన్నికల వేళ ఇతర పార్టీల నాయకులు చెప్పే జూటా మాటలను నమ్మొద్దని ఎమ్మెల్యే ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఆలోచించి పనిచేసే నాయకులకు, ప్రభుత్వానికే పట్టం కట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యానాయక్, వడిత రమేష్‌నాయక్, హన్మంత్ వెంకటేశ్‌గౌడ్, జెడ్పీటీసీ సలహాదారుడు మారుపాకుల సురేష్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు టీవీఎన్‌రెడ్డి, మండల రైతు బంధు అధ్యక్షుడు బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, కళ్యాణ్‌నాయక్ ఉన్నారు.

### బీఆర్ఎస్‌లో 50 కుటుంబాలు

చందంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లోకి ప్రజలు భారీగా చేరుతున్నారని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు ముత్యాల సర్వయ్య అన్నారు. ఆదివారం మండలంలోని గాగిళ్లాపురం గ్రామానికి చెందిన 50కుటుంబాలు సర్వయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మరోమారు దేవరకొండ ఎమ్మెల్యేగా రమావత్ రవీంద్రకుమార్ గెలుపొందడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తంచేశారు. పార్టీలో చేరిన వారిలో భూషరాజు వెంకటయ్య, భూషరాజు కోటయ్య, మల్లయ్యతో పాటు 50 మంది పార్టీలో చేరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు రాజవర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మల్లారెడ్డి, సర్పంచ్ కొండల్‌రెడ్డి, భయ్య రామకృష్ణ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి

గుడిపల్లి : ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని సర్పంచ్ శీలం శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం గుడిపల్లిలో సర్పంచ్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సురబోయిన రమేశ్, సొనగంటి రవి, అర్వపల్లి వెంకటయ్య, గోలి వెంకటయ్య, గోలి శ్రీను, గోలి యాదయ్య, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



చందంపేట: గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఆ పార్టీ మండలాధ్యక్షుడు ముత్యాల సర్వయ్య



గుడిపల్లి: గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న సర్పంచ్ శీలం శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

# ప్రగతి పథాన పర్తూనాయక్ తండా

- కొత్త పంచాయతీ ఏర్పాటుతో అభివృద్ధికి బాటలు
- తండా వాసులకు తొలగిన ఇక్కట్లు
- వైకుంఠధామం, పల్లె ప్రకృతివనం నిర్మాణం

దామరచర్ల, నవంబర్ 5: మండలంలో పర్తూనాయక్ తండా ప్రగతి పథాన పయనిస్తుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక గిరిజన తండాలను పంచాయతీలు చేసింది. ఈ క్రమంలోనే పర్తూనాయక్ తండా సైతం పంచాయతీగా ఏర్పడింది. తండాలో మొత్తం 690 జనాభా ఉంది. గతంలో ఈ తండా కొండ్రపోల్ పంచాయతీ పరిధిలో ఉండేది. అప్పట్లో పంచాయతీకి వెళ్లాంటే సుమారు మూడు కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉండేది. తండా అభివృద్ధికి నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడేవారు.

### ప్రభుత్వం నుంచి నేరుగా నిధులు

పర్తూనాయక్ తండా పంచాయతీగా ఏర్పాటు కావడంతో అన్ని రకాల ఇబ్బందులు తొలగాయి. ప్రభుత్వం నుంచి నిధులు నేరుగా వారికే చేరుతున్నాయి. దీంతో అభివృద్ధిలో దూసుకుపోతుంది. పంచాయతీకి వచ్చిన నిధులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయి. తండాల్లో సీసీ రోడ్లు నిర్మించుకున్నారు. మిషన్ భగీరథతో ఇంటింటికి నల్లాలను ఏర్పాటు చేసుకున్నారు. వైకుంఠ ధామం, కంపోస్ట్ షెడ్, క్రీడా ప్రాంగణం, పల్లె ప్రకృతి వనం నిర్మించుకున్నారు.

### నాలుగేండ్లలో అభివృద్ధి

పంచాయతీగా ఏర్పాటైన నాలుగేండ్లలో ఎంతో అభివృద్ధి జరిగింది. తండాకు చెందిన వారే సర్పంచ్‌గా, వార్డు సభ్యులుగా ఎన్నికయ్యారు. నిధులు నేరుగా వచ్చి అభివృద్ధి పనులు నిరాంటకంగా సాగుతున్నాయి. రూ.12.60 లక్షలతో శ్మశానవాటిక రూ.2.50కోట్లతో కంపోస్టుషెడ్ నిర్మాణం. 40వేలతో పల్లె ప్రకృతివనం, రూ.1.20 కోట్లతో ఉపాధి కింద సీసీ రోడ్ల నిర్మించారు. ఇవే కాక కోట్లాది రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి.

### ఇంటింటికీ సంక్షేమ పథకాలు


అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికీ సం క్షేమ పథకాలు అందుతున్నాయి. తం డాలో కల్యాణలక్ష్మి కింద ముగ్గురు లబ్ధిదారులకు రూ.3లక్షలు, రైతు బంధు కింద 232 మంది రైతులు లబ్ధి పొందారు. రైతుబీమాను సైతం ఓ రైతు కుటుంబానికి అందించారు. ప్రభు త్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో తండా వాసులు లబ్ధి పొందుతున్నారు.



పర్తూనాయక్ తండాలో నిర్మించిన వైకుంఠధామం

### మంచి సౌలత్‌లు వచ్చినయి

తండాలో మునుపటి కంటే ఇప్పుడు మంచి సౌలత్‌లు వచ్చినయి. ఇంటింటికీ మంచినీళ్లు వచ్చాయ్. రోడ్లు మంచిగా అయినయి. కరెంట్ సక్కంగా ఉంటుంది. తండాలోనే బియ్యం తెచ్చుకుంటానం. ఏ పంచాయితీ అయినా తండాలోనే తేల్చుకుంటానం.



- అడావత్ అచ్చమ్మ, పర్తూనాయక్ తండా